# ఇంటింటి కథ

-సి. ఉమాదేవి

ఆదివారం... ఉదయం... ఎనిమిది గంటలు. ఐ.యస్.డి. ఫోన్ మోగుతోంది.

"కాస్త ఆ ఫోను చూడండి." వంటింట్లో నుండి రేఖ కేక.

"గుర్తులేదా?" అత్తగారి హెచ్చరిక.

ఆదివారం... ఆటవిడుపు... రిలాక్స్‌డ్ మూడ్! చేతిలోనున్న సిగరెట్ విసిరేసి కార్డ్‌లెస్ అందుకున్నాడు రేఖ భర్త సుదర్శన్.

"హలో బేబీ..."

"డాడీ... హవ్వార్యూ?"

"ఫైన్..." కాసేపు అవి ఇవి అడిగి, "అల్లుడింట్లో వున్నాడా, మాట్లాడుతా" అడిగాడు సుదర్శన్.

"అంకుల్.. నమస్తే"

"నమస్తే.. నమస్తే... ఏంటి ఆ జెర్సీ పిల్లాడు కంపెనీ మారుస్తున్నాడట. వాళ్ల నాన్న చెప్పాడు. ఏమైనా ప్రాబ్లమా?" సుదర్శన్ గొంతులో ఆతృత.

"ఎవరు జెర్సీ పిల్లాడా? ఓహ్.." నవ్వి "న్యూజెర్సీ వంశీయేనా? మంచిపనే చేశాడండి. ఎక్కడ నాలుగు డబ్బులు ఎక్కువ ఇస్తే అక్కడ మనం చేరాలి. ఎంత పనికి అంత లాభం వుంటుంది కదా."

"పని ధ్యాసలో పడి ఆరోగ్యం పాడుచేసుకోకండి. సరే మరి బేబీకివ్వు వాళ్ల మమ్మీ మాట్లాడుతుంది."

"మమ్మీ! ఎలా వున్నావు మమ్మీ?"

"నే బాగానే వున్నా. నీవెలా వున్నావు? అన్నం, కూరలు వండుకుంటున్నావా? రొట్టెలతో సరిపెట్టె య్యకు."

అంతలో లేచి ఓపిక తెచ్చుకుని వచ్చింది సుదర్శన్ తల్లి.

"బేబీ.. నా తల్లీ... ఎట్టున్నావే?"

"ఆవకాయ అయిపోయింది నానమ్మా"

"అయ్యో" (పేగును ఆవకాయ బద్దతో కోసినంత బాధ)

"వడియాలన్నాయిలే" (నానమ్మ గుండెకు కాస్త ఊరట)

"నానమ్మా.. నాన్నకివ్వు"

"ఇదిగోమ్మా మీ డాడి ఇక్కడే." 'డాడి' అని నొక్కి పలికింది నాన్న అని పిలవదని.

"మళ్లీ నెక్స్ట్ సండే కాల్ చేస్తా డాడీ"

"ఓ..కె.. బై.. బై... ఇదిగో మమ్మీ బై చెప్తోంది."

"బై మమ్మీ!"

❖ ❖ ❖

అదే ఆదివారం. అదే ఉదయం. అదే కాలం కొంచెం అటు ఇటుగా- ట్రింగ్ మంది ఫోను.

అక్కడి నుండే-

"హలో"

"హలో"

"అమ్మా నేను మధుని"

"సరేలేరా బడాయి నీ గొంతు గుర్తుపట్టలేనా?"

"అమ్మా! ఎలా వున్నావు?"

## సూర్యుడు ఉదయిస్తున్నాడు

పేదల ఆకలి చావులను
రాజకీయ రాబందుల దుశ్చర్యలను
మదమెక్కిన మానవుల
అమానవీయ కార్యకలాపాలను
ధనదాహంతో
నమ్మిన వాళ్లనే వెన్నుపోటు పొడిచి
చేసే వికృత హాసాలను
కుల మతాల కుమ్ములాటలను
కూలీల కష్ట ఫలితాన్ని
జలగల్లా పీల్చే భూస్వాముల వైనాన్ని
గత రాత్రి చీకటినంతా
కళ్లలోకి ఇముడ్చుకొని
పొద్దున్నే నిత్య కార్యంగా
కాగితాలను అపురూపంగా ఏరుకొనే
వీధి బాలలను
పునఃదర్శనం చేసుకునేందుకేమో?
సూర్యుడు ఉదయిస్తున్నాడు
వీళ్లందరి జీవితాల్లో
తెలివనెడి వెలుగునివ్వటానికి
తన దినచర్య నాపలేదు.

-తోకల రాజేశం

## బొగ్గుపెల్ల

చిమ్మ చీకటి/ ఊపిరాడని విషమ స్థితి
ఎటూ కదలలేని దైన్యత / వేలేండ్లుగా నాది!
భూమి కడుపులోకి / ఎవరు తోశారో గాని
నలిగి నలిగి / వేడి సెగల్లో మాడిమాడి
దారుణంగా నల్లబడ్డాను!
ఇప్పుడు / నా ఒళ్ళంతా మసే
నన్ను ముట్టుకుంటే / అంటేది బొగ్గునుసే
అయినా / నా జాడలు వెతుక్కుంటూ
భూమిని చీల్చుకుంటూ / లోతుల్ని చుట్టుముడుతూ
వీరుల్లా నా అన్నలు...!
బహునేర్పుగా / బాంబులేసి, బ్లాస్టింగ్‌లు చేసి
చెమ్మస్, తట్టలతో / నన్ను టబ్బుల కెత్తు కుంటుంటే
నిలువెత్తు సంబరాన్నై
తడితడిగా పులకరిస్తుంటాను!
మరోవైపు / గుబులు గుబులవుతుంటాను!
బండ రాలి / పైకప్పు కూలి
నీళ్ళు నీళ్ళంతా ఎగజిమ్ముకొచ్చి
ఎక్కడ నా అన్నలు / క్షతగాత్రులవుతారో
శవాలై తేలుతారోనని / అనుక్షణం తల్లడిల్లుతుంట!
నా కోసం / నా 'వెలుగు' కోసం
రాకాసి గుహలోకి / అడుగుపెట్టినప్పుడే
నా అన్నల మనసును / అర్థం చేసుకున్నా...
నాకూ / నా అన్నలకూ మధ్య
పెద్ద తేడాలేదని తెలుసుకున్నా
ఎంత చీకటున్నా / లోపలెంత వెలితున్నా
తోటివాళ్ళ కోసం తండ్లాటలవ్వడం
గుండెల్తో సహా ఇవ్వగలగడం
ఈ నేల గుణమని గుర్తించా!
నా రంగు నలుపును / నా వాళ్ళ బతుకు నలుపును
బేరీజు వేశా / కారణాలు కనిపెట్టా...!
ఇక నేను / ఆగ్రహమై రగులుతాను!
నన్ను కొల్లగొట్టి
అణగద్రొక్కుతున్న వాళ్ళను
కనిపెట్టి దెబ్బకొడతాను!
త్యాగమై మండడం / కరంటై పండడం
నాకు కొత్తేమీ కాదు!

**-ఏలేశ్వరం వెంకటేశ్**

......

"అమ్మా"

"నా సంగతికేం గాని బాబూ, సరిగా వేళకు భోజనం చేస్తున్నావా?" (ఆనందం, దుఃఖం మిళితమైన కంఠస్వరం)

"ఆ.. ఆ... వండాక తినక చస్తానా?"

"అదేమిటి వండుకుంటున్నావా...?"

"ఆ చక్కగా వండుకుని తింటున్నా, ఉల్లిపాయ సాంబారు నేర్చేసుకున్నా. (కంట్లో ఉల్లిపాయ రసం పిండినంత బాధ, తాను ఉల్లిపాయలు కోస్తే ఓ గంట దాకా వంటింటి ముఖం చూడని కొడుకును తలుచుకుని)

"ఇంతకీ చెల్లాయి లేదామ్మా?" చెల్లాయి వుంటే ఫోనులోనే అన్నను వూపిరాడకుండా ఏవేవో మాట్లాడి అల్లరి పెట్టేది.

"కోచింగ్ కెళ్లింది. ఈ పాటికి రావాల్సింది. ఎందుకో ఆలస్యమైంది. వచ్చాక నా పని వుంది. అన్నయ్య ఫోను మిస్సయాను అని తెగ హైరానా పడుతుంది."

"సరేలే, దాని గురించి నాకు తెలియదా? నీవెలా వున్నావమ్మా?"

"మళ్లీ మళ్లీ అడుగుతున్నావు. నాకేంరా. నేను శుభ్రంగా వున్నాను."

"ఇక వుండనా అమ్మా. ఫ్రెండ్ వచ్చాడు. టెంపుల్ కెళ్తున్నాం. రెండు గంటల డ్రైవ్."

"సరే నాన్నా.. సరే సరే. దైవ దర్శనం అంటున్నావు. జాగ్రత్తగా వెళ్లిరండి"

అవతల ఫోను క్లిక్‌మంది పెట్టేసిన గుర్తుగా. కొడుకుతో మాట్లాడాక మధు తల్లి కన్నీళ్లను కన్నుల్లోనే భద్రపరిచేసింది స్వార్థంగా. తండ్రిలేని మధుని, పల్లవిని కళ్లల్లో పెట్టుకుని పెంచి పెద్దచేసింది. ప్రతి ఆదివారం మధు మరచిపోకుండా తల్లిని పలకరించి ఆమెకు అదనపు ఆక్సిజన్ నింపుతాడు. బిడ్డల అభివృద్ధికి బంధం వేయరాదని, కన్న బంధానికి దర్భముడి వేసుకుని కొడుకును అమెరికాకు పంపింది. స్వశక్తి మీద యమ్.యస్. చేస్తున్నాడు మధు. వారం వారం తల్లికి ఫోన్ తప్పనిసరి. విద్యార్థి దశలోనే మంచి స్కాలర్ షిప్‌ను అందుకున్నాడు. తన ఖర్చులైనా తగ్గించుకుంటాడు గాని తల్లికి ఫోన్ చేయక ఎగనామం పెట్టడు. సముద్రాలు దాటి ఎంతో దూరంలో వున్నా, అగాధమైన తల్లి మనసులో తనను చూడాలని తపించే తల్లి కోరికను కనుక్కోలేని వాడేంకాదు మధు. అయితే ఇంకా

సెమిస్టర్లన్నీ పూర్తికాలేదు. అందుకే గొంతుకలు విని తృప్తిపడుతున్నారు.

❖ ❖ ❖

మరో ఇంట.

"వినబడదేమిటే అమ్మడూ..." మంచంలోంచి లేచి రిసీవరెత్తలేని బామ్మ బాధ. ఆలోపే బాత్రూం నుంచి టవలుతో ముఖాన్ని తుడుచుకుంటూ శేఖరం, పెనంపై కసిని తీర్చుకోమని దోసెను వదిలేసి శేఖరం భార్య రమ చేతిలో అట్లకాడతో... పరుగులాంటి నడక... నడకలో పరుగు.

"హలో రా చిన్నూ ఎలా వున్నావురా?"

"ఫైన్ నాన్నా. మ్యూజికల్ చెయిర్స్ అదే 'మ్యూజికల్ ఫోను'లో నువ్వే గెలిచి ఫోనందుకున్నావా నాన్నా" నవ్వ సాగింది 'చిన్ను..' శేఖరం గారాల పట్టి.

"బామ్మ టమాటొ పికిల్ అదిరింది నాన్నా. చెప్పండి బామ్మకి."

"బామ్మ ఎప్పుడు చేసి పంపింది? అసలు లేవ లేందే" ఆశ్చర్యపోయాడు శేఖరం.

"అబ్బ రెసిపి మెథడ్ నాన్నా" ముద్దుగా విసుక్కుంది కూతురు.

"ఓహ్!" మనసునిండా నవ్వుకుని.

"నానమ్మా, నీవు చెప్పిన టమాటొ పచ్చడి చేసిం దట. చాలా రుచిగా వుందంటోంది" గొంతంతా పెంచి చెప్పాడు.

బామ్మ వినినట్లు తలాడించింది.

ఇలా ఫోనులో మాట్లాడటం, వంకాయ నుండి వజ్రాల హారం దాకా ఫోనులోనే చర్చించుకోవడం ఆవిడకెప్పటికీ కొత్తే.

"అమ్మ లేదా?"

"లేకేం. ఇదిగో" భార్యకు ఫోనందించాడు శేఖరం.

"హలో అమ్మా!"

......

"హలో అమ్మా ఎలా వున్నావ్?"

"మాట్లాడు మమ్మీ"

ఇంకేం మాట్లాడుతుంది రమ? బిడ్డ గొంతు విన్న ఆనందం, బిడ్డ దగ్గరలేదన్న విచారం. మిశ్రమ భావంతో గొంతు పూడుకుపోయింది.

అందరివలె తమ బిడ్డ కూడా సుఖంగా, దర్జాగా బ్రతకొచ్చు. ఉన్న వూరిలో సంబంధం కానప్పుడు అనకాపల్లయితేనేం, అమెరికా అయితేనేం! గుండెను రాయి చేసుకుంది రమ? బిడ్డ సుఖపడుతుంది. నాదే ముంది పండిపోయి రాలిపోయే ఆకును" అనుకుంది రమ. ఫలితం రమ కూతురు అమెరికాకు ఎగిరెళ్లి పోయింది.

తప్పదు. ఈ ఎడబాటు తల్లీ బిడ్డలకు తప్పదు. కూతురు తనను విడిచి వెళ్లింది మొదలు నిరాశ, నిస్పృహలు తొలుస్తున్నా అందరి ముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంది. ఆనందంగా వున్నట్లనుకోవా లని నటీమణి సావిత్రిని మించిన నటన! సన్నని ప్రకంపనలు పంపే గుండె దడ. బీటలు వారనున్న భూమికి భూప్రకంపనలు ముందే సూచించినట్లు దడదడలాడే గుండెను చిక్కబట్టుకుని కూతురెప్పు డొస్తుందో అంతవరకు గుండెను అతి భద్రంగా పదిల పరచుకోవాలనుకునే వెర్రితల్లి.

"అమ్మా.. వింటున్నావా? రాత్రి నీవు కలలోకి వచ్చావు."

"నా కలలో కాదు.. కన్నుల నిండా నీవే" (తల్లి మనసు)

"అమ్మా.. నీ ఆరోగ్యమెలా వుంది?"

"నాకేంరా... గుండ్రాయి (గుండె రాయి)లా వున్నాను. నీవు నా గురించి దిగులు పెట్టుకోకు. అన్నట్టు చిన్ను.. మొన్ననెవరో 'అమ్మా' అని పిలిచారు. 'ఆ' అని వెనుదిరిగా. వాళ్లంతా ఒకటే నవ్వు- వాళ్లమ్మతో సహా."

"ఎలామ్మా.. ఇలా అయితే..." నవ్వుల ఫౌంటెన్.

"సరేలే వేళకు భోంచేస్తున్నావా?" రమ ఆరాటం.

"ఏదో ఒక వేళకు భోంచేస్తున్నాలే" రమ కూతురు మళ్లీ నవ్వింది. ఆ నవ్వులను జాగ్రత్తగా గుండెలో దాచుకుంది రమ. అకస్మాత్తుగా అందిన తియ్యటి టానిక్‌ను గుండె ఆర్తిగా చప్పరించింది.

"అమ్మా మరి వుండనా. నాన్నకు, బామ్మకు చెప్పు బై చెప్పానని"

"బై చిన్ను"

"బై అమ్మా"

"ఆ..."

"బై..."

"ఊ..."

"బై అమ్మా... ఫోనే కాదు నవ్వులనూ క్రెడిల్ చేసింది రమ కూతురు. ఫోనును పెట్టెయ్యకుండా గట్టిగా ముద్దుపెట్టుకుంది రమ.

వంట ఇంట్లో పెనం మీద ఫ్లయింగ్ సాసర్ లాంటి నల్లటి ఆకారాన్ని వింతగా చూస్తున్నాడు రమ భర్త శేఖరం. ■